క్లుప్తంగా

బాక్సింగ్‌లో భానుతేజ సత్తా



భానుతేజను అభినందిస్తున్న దృశ్యం

రాయదుర్గం: 69వ స్కూల్స్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ 2025–26 రాష్ట్రస్థాయి పోటీలో రాయదుర్గం లోని నాగార్జున స్కూల్‌ విద్యార్థి భానుతేజ బంగారు పతకాన్ని సాధించి జాతీయస్థాయి బాక్సింగ్‌ పోటీలకు అండర్‌–17 విభాగంలో ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ బాక్సింగ్‌ పోటీలను హనుమకొండలోని జేఎన్‌ఎస్‌ స్టేడియంలో నిర్వహించారు. సోమవారం రాయదుర్గంలోని పాఠశాలలో కరస్పాండెంట్‌ భరత్‌కుమార్‌, ప్రిన్సిపల్‌ సుందరి భానుతేజను అభినందించారు.

1569 మంది చిన్నారులకు చుక్కల మందు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలో బస్తీలు, కాలనీల్లో రెండవ రోజు పల్స్‌ పోలియో కార్యక్రమం కొనసాగింది. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయని చిన్నారులను గుర్తించి వేశారని మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రాకేష్‌ తెలిపారు. రెండవ రోజు 1569 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బానోతు నగేష్‌ కేసును విచారణ జరపాలి

మియాపూర్‌: మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ప్రైవేటు హాస్టల్‌లో అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన బానోతు నగేష్‌ కేసును విచారణ జరపాలని జాతీయ ఎస్టీ కమిషన్‌ సైబరాబాద్‌ పోలీస్‌ కమీషనర్‌కు నోటీసులు జారీ చేసింది. ఖమ్మం జిల్లా ఏనకుంటతండాకు చెందిన బానోతు నగేష్‌(35) మియాపూర్‌ బాలాజీనగర్‌ కాలనీలోని ఏఎంబీ మెన్స్‌ హాస్టల్‌లో ఉంటూ ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. సెప్టెంబర్‌ 24న అనుమానాస్పద స్థితిలో హాస్టల్‌లోని బాత్రూమ్‌లో మృతిచెందిన ఘటన తెలిసిందే. బానోతు నగేష్‌ మృతిపై అనుమానాలున్నాయని సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన న్యాయశాస్త్ర విద్యార్థి సబావత్‌ కల్యాణ్‌ సెప్టెంబర్‌ 30న జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో 15 రోజుల్లోగా కేసు పురోగతి, చర్యల వివరాలు జాతీయ ఎస్టీ కమిషన్‌కు తెలియజేయాలని సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌కు ఈ నెల 7వ తేదీన నోటీసులు జారీ చేసింది. నిర్ణీత గడువులోగా కేసు సమాధానం రాకుంటే కోర్టు అధికారులతో సమాన్లు జారీ చేయడం జరుగుతుందని విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని కమిషన్‌ హెచ్చరించింది.

బస్తీలో కార్పొరేటర్‌ పర్యటన



కలుషిత నీటి సరఫరాను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మహేందర్‌

మూసాపేట: జనతానగర్‌ బస్తీలో స్థానిక కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏఎంఓహెచ్‌ అధికారితో ఫోన్లో మాట్లాడి ఫీల్డ్‌లో పనిచేయని ఎస్‌ఎఫ్‌ఏపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన నీటి సరఫరా, శుభ్రమైన పరిసరాలు ఉండేలా చూడాలని, కలుషిత నీటి సరఫరా ను వీలైనంత త్వరగా పరిష్కరించకుంటే ప్రజల తరపున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్‌ బీజేపీ వైస్‌ ప్రెసిడెంట్‌ శ్రీనివాసరావు, డివిజన్‌ ప్రధాన కార్యదర్శి రవిగౌడ్‌, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు టమాట రూ.30, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 50, గోకర 70, బీన్స్‌ 70, బీట్‌రూట్‌ 50, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 30, క్యారెట్‌ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్‌ (1) 50, సొరకాయ (కేజీ) 30, అల్లం 110, వెల్లుల్లి 150.

వెచ్చని నేస్తాలు వచ్చేశాయ్‌



ఆల్విన్‌ కాలనీ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుప్పట్ల దుకాణం



హఫీజ్‌పేట్‌లో రంగు రంగుల దుప్పట్లు, చిన్నారుల మంకీ క్యాప్స్‌

చందానగర్‌: శీతాకాలం వచ్చిందంటే ప్రతి ఒక్కరికి గుర్తుకు వచ్చేది వెచ్చని దుప్పటి. నగరంలో ఈ సంవత్సరం ఉదయం ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి ప్రారంభం అవుతుంది. దీంతో రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున్న ఇప్పటికే మియాపూర్‌, హఫీజ్‌పేట్‌, మదీనాగూడ, న్యూ హఫీజ్‌పేట్‌ పరిసర ప్రాంతాలలో దుప్పట్ల దుకాణాలు వెలిశాయి. శీతాకాలం ప్రారంభ దశలోనే ఈ దుప్పట్ల స్టాళ్లు ఏర్పాటు చేశారు. చలి నుంచి కాపాడుకొవడానకి వెచ్చని దుప్పట్లు, ఉన్ని దుస్తులకు డిమాండ్‌ పెరిగింది. మధ్యప్రదేశ్‌, రాజస్థాన్‌ రాష్ట్రాలకు చెందిన చిరు వ్యాపారులు ఏళ్ల తరబడి ఇక్కడే నివాముంటూ శీతాకాలం దుప్పట్లు, స్వెటర్లు, మంకీ క్యాపులు, మాస్కులు, హ్యాండ్‌ గ్లౌజులు విక్రయిస్తున్నారు. హిమాచల్‌ ప్రదేశ్‌, లుథియానా, హరియానా తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులు, దుప్పట్లు తీసుకొస్తున్నారు.

చిన్నారులు, వృద్ధులు, మహిళలకు రంగు రంగుల మంకీ క్యాపులు, స్వెటర్లు, మాస్కులు అందుబాటులో ఉంచారు.

ప్రజావాణిలో 18 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న మహేష్‌ యాదవ్‌

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌–21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భారీగా ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్‌–14, ఇంజినీరింగ్‌–03, వెటనరీ–01 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్‌, ఏఎంసీ కృష్ణ, ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవికుమార్‌, ఇంజినీరింగ్‌ డీఈ దుర్గప్రసాద్‌, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.

ఛట్‌పూజకు వసతులు కల్పించాలి..

హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలో చుట్టుపక్కల ప్రాంతాల్లో బిహార్‌, యూపీ, ఝార్ఖండ్‌ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించే ఛట్‌పూజకు వసతులు కల్పించాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్‌ యాదవ్‌ జీహెచ్‌ఎంసీ అధికారులకు వినతి పత్రం అందించారు. మదీనాగూడ ప్రభుత్వ పాఠశాల, హుడాకాలనీ, సాయిబాబా దేవాలయం, లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారాయని వెంటనే మరమ్మతు చేపట్టాలని వినతిలో కోరారు.

కొత్తరూట్లలో బస్సుల సంఖ్య పెంచాలి



కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డిని సన్మానించిన అపార్ట్‌మెంట్ల వాసులు

రాయదుర్గం: ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త రూట్లలో బస్సు సర్వీసులను పెంచాలని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితాండలోని హానర్‌ ఆక్వాంటీస్‌, బ్రిక్స్‌ స్కైవుడ్స్‌ సమీపంలో కొత్త బస్టాప్‌ను ఆయన బర్కత్‌పురా ఆర్టీసీ డిపో మేనేజర్‌ మంజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. బస్టాప్‌ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్‌ నిర్మాణానికి తన వ్యక్తిగత నిధులు వెచ్చిస్తానన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులను పెంచాలని, కొత్త రూట్లను ప్రవేశపెట్టాలని అభ్యర్థించారు. కొత్త రూట్లలో ప్రజలకు రవాణా సౌకర్యార్థం మెరుగుపడడానికి ఒక మంచి ముందడుగన్నారు. అనంతరం స్థానికులు రహదారుల మరమ్మతులు, ఓపెన్‌నాలా కవరింగ్‌, లేక్‌ డెవలప్‌మెంట్‌ శ్మశానవాటిక సుందరీకరణ, తాగునీటి వసతి మెరుగుదల, వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరగా దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, చిదంబరం, సందీప్‌, హన్మంతునాయక్‌, నవీన్‌, శంకర్‌, గోపీనాయక్‌, రాజునాయక్‌, సుమన్‌, నర్సింహా, నర్సింగ్‌, ప్రకాశ్‌రాథోడ్‌, శ్రీశైలం పాల్గొన్నారు.

స్పెషల్‌ డ్రైవ్‌లో 44 ఆటోలు సీజ్‌



ఆటోలను తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్లు

చందానగర్‌: మియాపూర్‌ ఆల్విన్‌ కాలనీ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన స్పెషల్‌ డ్రైవ్‌లో 44 ఆటోలను సీజ్‌ చేశారు. కొండాపూర్‌ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు మనోజ్‌, శ్రీముఖి, స్వాతి, మియాపూర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌తో కలిసి ఆటో రిక్షాలపై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించగా సరైన పత్రాలు లేని, ఫిట్‌నెస్‌ సర్టిఫికెట్లు, ఇతర జిల్లా రిజిస్ట్రేషన్లు, తదితర కారణాలతో సీజ్‌ చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ మనోజ్‌ తెలిపారు. ఆటో డ్రైవర్లు వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు దస్తావేజులు ఇతర సర్టిఫికెట్లు కలిగి ఉండాలన్నారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్లు నవీన్‌, సిబ్బంది పాల్గొన్నారు.



సీజ్‌ చేసిన ఆటోలు

చిల్డ్రన్‌ కార్యాలయం ప్రారంభం



సెంటర్ల ప్రారంభోత్సవంలో మురళీ డీవీ

మాదాపూర్‌: సంస్థ సమగ్రత, సంరక్షణ శిశు అభివృద్ధిలో ఉన్నత ప్రమాణాల పట్ల అంకితభావాన్ని కలిగి ఉందని డీవీస్‌ లేబొరేటరీస్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ డాక్టర్‌ మురళీ డీవీ తెలిపారు. మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీలో సోమవారం డీవీస్‌ ఫౌండేషన్‌ ఫర్‌ గిఫ్టెడ్‌ చిల్డ్రన్‌ కొత్త కార్యాలయాన్ని, వర్ణం చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దకాలంలో సంస్థ ఫౌండేషన్‌ చేసిన సేవలను ప్రశంసించారు. ప్రతి పిల్లవాడి సామర్థ్యాన్ని గుర్తించి వారికి అవకాశాలను సృష్టించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్త డీఎఫ్‌జీసీ (డీవీస్‌ ఫౌండేషన్‌ ఫర్‌ గిఫ్టెడ్‌ చిల్డ్రన్‌) లోగోను మేనేజింగ్‌ ట్రస్టీ నిలిమా డీవీ ప్రారంభించారు.

సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌పై స్పెషల్‌ డ్రైవ్‌

100 మంది వాహనదారుల పట్టివేత..

బంజారాహిల్స్‌: సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ వల్ల బైక్‌ నడుపుతున్న వ్యక్తికే కాకుండా ఎదురుగా వచ్చేవారికీ ప్రమాదం పొంచి ఉంటుందని నగర ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌హెగ్డే అన్నారు. వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌పై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. పంజగుట్ట చౌరస్తాలో చేపట్టిన వాహన తనిఖీలను వెస్ట్‌జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ పట్టుబడిన స్కూటరిస్టులకు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ వల్ల ఎన్నో అనర్థాలు పొంచి ఉన్నాయని, ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హితవు పలికారు. బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, పంజగుట్ట, ఎస్సార్‌నగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 చోట్ల నిర్వహించిన డ్రైవ్‌లో 100మంది స్కూటరిస్టులు సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.

అక్రమ దుకాణాలను తొలగించండి



అక్రమ దుకాణాలను పరిశీలిస్తున్న గజరావు భూపాల్‌

చందానగర్‌: మదీనాగూడ జాతీయ రహదారి సర్వీస్‌ రోడ్డుపై ఉన్న అక్రమ దుకాణాలను తొలగించాలని సైబరాబాద్‌ జాయింట్‌ కమిషనర్‌ డాక్టర్‌ గజరావు భూపాల్‌ ఆదేశించారు. సోమవారం సాయంత్రం మియాపూర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మదీనాగూడ జాతీయ రహదారి సర్వీస్‌ రోడ్డును సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఫుట్‌పాత్‌ ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ట్రాఫిక్‌ పోలీస్‌ అధికారులు తొలగించాలన్నారు. ఆయన వెంట మేడ్చల్‌ ట్రాఫిక్‌ డీసీపీ రాజన్‌రతన్‌, అడిషనల్‌ డీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్‌ ఏసీపీ వెంకటయ్య, మియాపూర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రశాంత్‌ ఉన్నారు.

ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

మణికొండ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం బీఆర్‌ఎస్‌ పార్టీతోనే సాధ్యమని, ఆ పార్టీకి అండగా నిలిచి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ మైనార్టీ విభాగం ఇంచార్జి షేక్‌ ముక్తార్‌ పాషా ఆధ్వర్యంలో సబితారెడ్డి సమక్షంలో వంద మందికిపైగా ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ... బీఆర్‌ఎస్‌ పాలనలో మైనార్టీ విద్యా సంస్థలు, రేషన్‌ కార్డులు, షాదీముబారక్‌ లాంటి ఎన్నో పథకాలను అమలు చేయటంతో లక్షలాది మంది లబ్ధిపొందారన్నారు. మైనార్టీలకు బీఆర్‌ఎస్‌ పార్టీ రాష్ట్ర హోం మంత్రి పదవిని ఇచ్చిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లోనూ వారికి అన్ని రంగాలలో పెద్ద పీట వేస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ముత్యాలు, గణేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌, చిరంజీవి, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ అసెంబ్లీ ఉప ఎన్నిక నవంబర్‌ 11న జరగనుండగా సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. ప్రచారం ఊపందుకుంది. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్డు పనులకు శంకుస్థాపనలు జరిగినా ఇప్పటిదాకా 20 శాతం కూడా పూర్తి కాలేదు. అడుగడుగునా రోడ్లపై గోతులు ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతున్నాయి. ప్రచారానికి వచ్చే నేతలను నిలదీసే అవకాశం ఉండటంతో బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రధాన రహదారుల్లో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చాలా చోట్ల గుంతలు స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ప్రధాన, అంతర్గత, కాలనీ రోడ్లు గుంతలమయమై నరకాన్ని చూపిస్తుండగా ప్రచారంలో ప్రభుత్వంపై విమర్శలు వచ్చే అవకాశం ఉండడంతో కొంతవరకైనా వీటిని పూడ్చాలని జీహెచ్‌ఎంసీ సిబ్బంది పనులు మొదలుపెట్టారు.

చెక్కుల పంపిణీ

మియాపూర్‌: ప్రజా సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ చెక్కులను కార్పొరేటర్లు రాగం నాగేందర్‌ యాదవ్‌, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన అందజేశారు.

17నుంచి జూబ్లీహిల్స్‌ ఎస్వీ ఆలయంలో పవిత్రోత్సవాలు

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబర్‌ 17 నుంచి 19 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకు 16న సాయంత్రం అకురార్పణ చేయనున్నట్లు తెలిపారు. యాత్రికులు, సిబ్బంది వల్ల తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానివ్వకుండా నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పవిత్రోత్సవాల్లో మొదటి రోజైన 17వ పవిత్ర ప్రతిష్ట, 18న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు నిర్వహిస్తారని, 19న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరుగనుందని, పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవాలకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నట్లు వారు వివరించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు టౌన్‌: తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలో ఇటీవల విలీనమైన గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి అన్నారు. ముత్తంగి గ్రామ పరిధిలోని వివిధ కాలనీల్లో రూ.12 కోట్ల 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విలీన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ముత్తంగి పరిధిలోని నూతన కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్‌, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌ గౌడ్‌, మండల తహసీల్దార్‌ రంగారావు, మున్సిపల్‌ కమిషనర్‌ అజయ్‌రెడ్డి సీనియర్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు నష్టపరిహారం చెల్లించండి

పటాన్‌చెరు టౌన్‌: పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు సంఘటనలో మరణించిన, గాయపడిన, మిస్సింగ్‌లో ఉన్న వారి కుటుంబాలకు ఇంతవరకు పూర్తి నష్టపరిహారం అందించలేదని మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్‌ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘటన జరిగి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం ఏ ఒక్కరికి పూర్తిగా నష్ట పరిహారం అందలేదన్నారు. దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కోర్టు పేరు చెప్పి బాధితులకు ఇస్తామన్న రూ. కోటి ఇవ్వకపోవడం సరికాదన్నారు.

క్రీడలు జీవన విధానంలో భాగం కావాలి

- తైక్వాండో చీఫ్‌ గ్రాండ్‌ మాస్టర్‌ జయంత్‌రెడ్డి



గెలుపొందిన క్రీడాకారులు

మణికొండ: ప్రతి ఒక్కరికీ క్రీడలు ఎంతో అవసరమని, వాటిని జీవన విధానంలో భాగం చేసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటంతో పాటు మానసికంగా ఎంతో ఉల్లాసంగా జీవించవచ్చని తైక్వాండో చీఫ్‌ గ్రాండ్‌ మాస్టర్‌ జయంత్‌రెడ్డి అన్నారు. మణికొండకు చెందిన సోమాస్‌ ఫిట్‌ తైక్వాండో చాంపియన్‌ షిప్‌–2025 పోటీలు స్థానిక సుందర్‌ గార్డన్స్‌లో ఆదివారం జరిగాయి. రాత్రి జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... తైక్వాండో అంతర్జాతీయ క్రీడ అని దీని వలన పిల్లలో ఆత్మవిశ్వాసం పెరగటంతో పాటు శారీరక, మానసిక దృఢత్వం నెలకొంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితిలో ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు ఇలాంటి క్రీడలను నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడలనే కెరీర్‌గా మలుచుకోవటం, ఉద్యోగాలు సాధించటం ఎంతో మంది చేస్తున్నారన్నారు. ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆయన మెమొంటోలు, మెడల్‌లను అందించారు. సోమాస్‌ ఫిట్‌ వ్యవస్థాపకులు విజయ్‌కుమార్‌, కోచ్‌లు రాజు, విశాల్‌, జైరామ్‌లు, అతిథులుగా సురేష మలిక్‌, మొయిన్‌, హనుమంతు తదితరులతో పాటు వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు.





ఆకట్టుకుంటున్న చిత్ర ప్రదర్శన

మాదాపూర్‌: తండ్రీ కొడుకులు వేసిన చిత్రాల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో జి.మద్దిలేటి, తేజ వేసిన 20 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ప్రముఖులు కొనియాడారు. ఈ నెల 17వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

